రైతులను ఆదుకోవాలని వినతి



కీసర తహసీల్దార్‌ కార్యాలయం వద్ద వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యాసాగర్‌రావు, శ్రీశైలం తదితరులు

కీసర: రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు, రైతుబంధు, రైతుబీమా పథకాలను అమలు చేయాలని డిమాండ్‌ చేస్తూ.. మంగళవారం కీసర మండల బీజేపీ కిసాన్‌ మోర్చా అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో కీసర తహసీల్దార్‌ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ కిసాన్‌ మోర్చా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీల్లో ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ చేసి, రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించాలన్నారు. ఈ సీజన్‌లో పంటల సాగు కొనసాగుతున్నా.. ఇప్పటి వరకు రైతుభరోసా కింద సాయం ఇవ్వలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్‌బీమా యోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. బీజేపీ కిసాన్‌ మోర్చా నాయకులు మెట్టు కృష్ణయాదవ్‌, జిల్లా స్వచ్ఛభారత్‌ కన్వీనర్‌ సుధాకర్‌, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు నల్ల వెంకట్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రమేష్‌, కీసర మండల కార్యవర్గ సభ్యులు గోసుల శ్రీనివాస్‌, కృష్ణ యాదవ్‌ రైతులు పాల్గొన్నారు.

రెండు లక్షల రుణమాఫీ చేయాలని..

ఘట్‌కేసర్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడితే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రుణమాఫీ చేయాలని భారతీయ జనతా కిసాన్‌ మోర్చా మండల అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్‌ రజనికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు గడుస్తున్నా.. రైతులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని, తక్షణమే రుణమాఫీ చేయాలని డిమాండ్‌ చేశారు. బిక్కునాథ్‌ నాయక్‌, రామోజీ, శ్రీశైలం, రఘు, సత్యనారాయణ, రాజేష్‌, కుమారస్వామి ఇతర నాయకులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

జవహర్‌నగర్‌: మీసేవా కేంద్రాల్లో జరుగుతున్న దోపిడీని అరికట్టి, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ, ఎన్‌పీఆర్‌డీ సంఘాలు మంగళవారం తహసీల్దార్‌ సుచరితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లోని ఓ మీ సేవా కేంద్రానికి ఆధార్‌కార్డు కావాలని వెళ్తే రూ.10 వేలు చెప్పడంతో సదరు వినియోగదారులు కంగుతిన్నాడన్నారు. చివరికి రూ.6700 అయితే చేస్తామని చెప్పడంతో అప్పు చేసి డబ్బు కట్టాడని ఆరోపించారు. ఇలాంటి వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్‌పీఆర్డీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్‌ సంతోష్‌ తదితరులున్నారు.

సైబర్‌క్రైమ్‌, డ్రగ్స్‌పై అవగాహన

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్‌ పరిధి అహ్మద్‌గూడలోని సెయింట్‌ ఆండ్రూస్‌ స్కూల్‌ రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్‌, కీసర పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం సైబర్‌ క్రైమ్స్‌, అండ్‌ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కీసర సీఐ వెంకటయ్య పాల్గొన్నారు. డ్రగ్స్‌ వినియోగం వల్ల కలుగుతున్న ఇబ్బందులను విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్‌ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్‌ సభ్యులు, స్కూల్‌ మేనేజ్‌మెంట్‌ సభ్యులు, ఉపాధ్యాయులు, ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలనపై ప్రత్యేక దృష్టి

మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌



ఉన్నతాధికారుల సమావేశంలో కలెక్టర్‌ గౌతమ్‌

సాక్షి,సిటీబ్యూరో: వనమహోత్సవం, ప్లాంటేషన్‌, మహిళాశక్తి క్యాంటిన్‌, వ్యవసాయం, సీజనల్‌ వ్యాధులు, అమ్మ ఆదర్శ పాఠశాలలు, ధరణి, బదిలీల విషయంలో ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధి త అధికారులకు జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ సూచించా రు. మంగళవారం కలెక్టరేట్‌ నుంచి వీడియో కా న్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో ఆయన మాట్లాడారు. జిల్లా అదనపు క లెక్టర్‌ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు, డీపీఓ వెంకయ్య, జి ల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రఘునాథస్వా మి, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యతకు అనుగుణంగా..

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాధాన్యతకు అనుగుణంగా పెండింగ్‌ పనులతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేయాలన్నారు. వ్యవసాయం, హెల్త్‌, ధరణి, ఉద్యోగుల బదిలీలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలలో తనిఖీలు..



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్‌

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్‌ హైస్కూల్‌ను కలెక్టర్‌ గౌతమ్‌ తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో కలిసి ఆయన క్లాసుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని వారి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధనలు అందించాలని ఉపాధ్యాయులను కోరారు. పాఠశాలలో డైనింగ్‌హాల్‌, తాగునీరు, వాష్‌ ఏరియా వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా పాఠశాలలో చేపడుతున్న నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జీవో–59 ద్వారా డబ్బులు చెల్లించాలని, రిజిస్ట్రేషన్లు కావడం లేదని, దీనిపై పునరాలోచన చేయాలని మేయర్‌ శాంతి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గబ్బిలాలపేటలో పేద విద్యార్థుల కోసం ప్రైమరీ స్కూల్‌ కేటాయించాలని కార్పొరేటర్‌ మేక లలితాయాదవ్‌ కలెక్టర్‌కు విన్నవించారు. జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, డీడబ్ల్యూఓ కృష్ణారెడ్డి, మేయర్‌ శాంతి, కమిషనర్‌ తాజ్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్‌ సుచరిత, ఆర్‌ఐ లక్ష్మి, కార్పొరేటర్లు తదితరులున్నారు.

కన్వర్షన్‌ రద్దు చేయాలని వినతి..

మేడ్చల్‌: మండలంలోని రాజబోల్లారం తండా గ్రామంలో భూమిని అక్రమంగా కన్వర్షన్‌ చేశారని దానిని రద్దు చేయాలని గిరిజనులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రాజబోల్లారం పరిధిలోని సర్వే నంబర్‌ 207లోని 18 ఎకరాల 5గుంటల భూమి గిరిజనులదని, గతంలో తేల్చగా.. 'తహసీల్దార్‌ అక్రమంగా కన్వర్షన్‌ చేశారని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుని గిరిజనులకు న్యాయం చేయాలని వారు కోరారు'.

సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జవహర్‌నగర్‌: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మరిన్ని సేవలు అందించాలని మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ అన్నారు. మంగళవారం జవహర్‌నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన అధికారులతో కలిసి ఆయూష్‌ విభాగం, ఎమర్జెన్సీ, డ్రెస్సింగ్‌, ఇమ్యూనైజేషన్‌, ఫార్మసీ, ఆపరేషన్‌ థియేటర్‌, ఇన్‌ పేషంట్‌ రూమ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు వైద్యంపై నమ్మకం కలిగించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరోగ్య కేంద్రాన్ని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని చెప్పారు. సాధారణ ప్రసవానికి అవకాశం కల్పించేందుకు వైద్యాధికారులు అందుబాటులో ఉండాలని, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పెంచాలని సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి రఘునాథస్వామి, జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ మేయర్‌ శాంతి, తహసీల్దార్‌ సుచరిత, కమిషనర్‌ తాజ్‌మోహన్‌రెడ్డి, వైద్యాధికారి సుష్మ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్‌ నేతలు

కీసర: పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క పుట్టినరోజు సందర్భంగా నాగారం మున్సిపల్‌ కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్‌ నేతలు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్‌ కట్‌ చేయించారు. యూత్‌ కాంగ్రెస్‌ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో సిబ్బందిని నియమించాలి



ఘట్‌కేసర్‌ ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

ఘట్‌కేసర్‌: ప్రభుత్వాసుపత్రిలో సిబ్బంది కొరతను తీర్చాలని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వినోద, సృజన అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం ఐద్వా ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దవాఖానాలో పగలు, రాత్రి వైద్యం అందించేందుకు ఒకే వైద్యుడు అందుబాటులో ఉంటున్నారని, పరీక్ష మిషన్లు ఆపరేట్‌ చేసే సిబ్బంది, చిన్నపిల్లల టానిక్‌లు, నర్సులు కొరత ఉందన్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్‌ కోట్యానాయక్‌ను కలిసి ఆసుపత్రిలోని సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. ఐద్వా మండల కార్యదర్శి అరుణ, సభ్యురాలు అనసూయ, శ్రామిక మహిళ జిల్లా నాయకురాలు సబిత, నాయకులు నీరజారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో వసతుల కల్పనకు కృషి



పాఠశాలను పరిశీలిస్తున్న కౌన్సిలర్‌, కమిషనర్‌

మేడ్చల్‌: పట్టణంలోని 18వ వార్డులోని ప్రైమరీ పాఠశాలను వార్డు కౌన్సిలర్‌ భవానీరాఘవేందర్‌గౌడ్‌, కమిషనర్‌ నాగారెడ్డితో కలిసి సందర్శించారు. పాఠశాలకు కావాల్సిన వసతులు, పిల్లల సంఖ్యతో పాటు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల స్థలంలో ఉదయం ప్రార్థనకు కలిగే ఇబ్బందుల గురించి విద్యార్థులు విన్నవించడంతో మున్సిపల్‌ తరుపున ఫ్లోరింగ్‌ చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయురాలు వినయశ్రీ, మున్సిపల్‌ ఆర్‌ఐ రాంచందర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి మొక్కల పంపిణీ..



20వ వార్డులో మొక్కలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్‌ దీపిక

మేడ్చల్‌: ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ దీపికానర్సింహారెడ్డి కమిషనర్‌ నాగారెడ్డితో కలిసి పట్టణంలోని 20వ వార్డులో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. ప్రతి మహిళ తన ఇంటి ముందు పూల మొక్కలు, పండ్ల మొక్కలు ఖచ్చితంగా నాటాలని ఆమె సూచించారు. ఒక్కో మహిళ ఒక మొక్క నాటితే మేడ్చల్‌ పట్టణంలో వేల సంఖ్యలో మొక్కలు పెరుగుతాయన్నారు. ఇంటి ముందు పూలమొక్కలు, పండ్ల మొక్కలు నాటితే ఇంటికే అందం వస్తుందన్నారు. మొక్కలు తీసుకున్న ప్రతీ మహిళ మొక్కను నాటి వాటిని సంరక్షించాలని, మొక్కతో సెల్ఫీ దిగి మున్సిపల్‌ అధికారులకు పంపాలన్నారు. ఏఈ జ్ఞానేశ్వర్‌రెడ్డి, ఆర్‌ఐ రాంచందర్‌, మహేశ్వర్‌రెడ్డి, రాధాబాయి వార్డు మహిళలు పాల్గొన్నారు.

వన మహోత్సవంలో ఎంపీ, ఎమ్మెల్యే



మొక్క నాటుతున్న ఎంపీ ఈటల రాజేందర్‌, ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడిపల్లి: మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌లో మేయర్‌ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్‌, ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరై సెట్విన్‌ సెంటర్‌ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ త్రిలేశ్వర్‌ రావు, బీఆర్‌ఎస్‌ కార్పొరేటర్లు, కో ఆప్షన్‌ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్‌

ఘట్‌కేసర్‌: గంజాయి విక్రయించడానికి వచ్చిన ఓ వ్యక్తిని ఘట్‌కేసర్‌ పోలీసులు మంగళవారం సాయంత్రం అరెస్ట్‌ చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ద్వారకానగర్‌ పేజ్‌–2 చెంగిచెర్లకు చెందిన మనీష్‌ ఉపాధ్యాయ (25) రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారి. కాగా విశ్వసనీయ సమాచారం మేరకు గంజాయి విక్రయించేందుకు వచ్చిన వ్యక్తి పట్టణంలోని శ్రీనిధి నెస్ట్‌ ఓయో హోటల్‌లో ఉన్నాడన్న సమాచారంతో ఘట్‌కేసర్‌ పోలీసులు హోటల్‌పై దాడులు నిర్వహించి మనీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద 1.12 కిలోల గంజాయి లభ్యమైంది. పోలీసుల విచారణలో నిఖిల్‌ అనే వ్యక్తి దగ్గర కొనుగోలు చేసినట్లు పేర్కొన్నాడు. గంజాయితో పాటు ఓ సెల్‌ఫోన్‌ను సీజ్‌ చేసి డీపీఎస్‌ చట్ట ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

స్టీల్‌ బాటిల్స్‌ అందజేత

మల్లాపూర్‌: నాచారం ఓల్డ్‌ విలేజ్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ హైదరాబాద్‌ ఆధ్వర్యంలో స్టీల్‌ బాటిల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌ క్లబ్‌ డిస్ట్రిక్‌ గవర్నర్‌ కృష్ణ ప్రసాద్‌, నాచారం మహంకాళి చైర్మన్‌ కృష్ణారెడ్డి, వీడీజీ ఇన్నారెడ్డి, కృష్ణారెడ్డి, డీఎస్‌సీ శేఖర్‌రెడ్డి, లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షులు సదానందం, స్టీల్‌ బాటిల్స్‌ డోనర్‌, జోన్‌ చైర్మన్‌ నందికొండ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయం కేటాయించండి



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

మల్కాజిగిరి: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి క్యాంపు కార్యాలయం కేటాయించాలని బీఆర్‌ఎస్‌ నాయకులు మల్కాజిగిరి సర్కిల్‌ డీసీ రాజుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గతంలో ఎమ్మెల్యేగా ఆకుల రాజేందర్‌ ఉన్నప్పుడు మల్కాజిగిరి చౌరస్తాలో ఇందిరామహిళాభవన్‌ పేరిట భవన నిర్మాణం చేశారన్నారు. ప్రస్తుతం ఆ భవనం రెండవ అంతస్తు ఖాళీగా ఉందని, ప్రజలకు అందుబాటులో ఉండడానికి కేటాయించాలని డీసీని కోరారు. కార్యక్రమంలో రాముయాదవ్‌, ఉపేందర్‌, ఉపేందర్‌రెడ్డి, సతీష్‌, మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

15న మేయర్‌, డిప్యూటీ మేయర్‌ ఎన్నిక

బోడుప్పల్‌: బోడుప్పల్‌ నగర పాలక సంస్థ మేయర్‌, డిప్యూటీ మేయర్‌ ఎన్నికకు మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ పార్థసారథి నోటిఫికేషన్‌ జారీ చేశారు. ఈ నెల 15వ తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించి మేయర్‌, డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకోనున్నారు. జిల్లా కలెక్టర్‌ ద్వార ప్రత్యేకంగా అధికారం పొందిన ప్రత్యేక గెజిటెడ్‌ స్థాయి అధికారి ఈ ఎన్నికను నిర్వహించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఫారం–3 ప్రకారం ఈ నెల 12వ తేదీన లేదా అంతకు ముందే మున్సిపల్‌ కార్పొరేషన్‌లోని సభ్యులకు నోటిఫికేషన్‌ విషయం తెలియజేయాలని వెల్లడించారు.

పోలీసుల తనిఖీలు

ఉప్పల్‌: ఉప్పల్‌ భగాయత్‌లో తిష్టవేస్తున్న ఆకతాయిల కోసం పోలీసులు జల్లెడ పడుతున్నారు. సోమవారం రాత్రి 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ఉప్పల్‌, రామాంతాపూర్‌ భగాయత్‌ లే అవుట్‌లో ఏసీపీ చక్రపాణి, ఉప్పల్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎలక్షన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత భగాయత్‌లో సంచరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అల్వాల్‌: గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు కుషాయిగూడ ఏసీపీ ఆధ్వర్యంలో రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. నేరెడ్‌మెట్‌ పోలీసులు, 30 మంది సిబ్బందితో కలిసి వినాయక్‌నగర్‌లోని వివిధ ప్రదేశాలు, రైల్వే ట్రాక్‌ వద్ద తనిఖీలు చేశారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్‌: విద్యుత్‌ లైన్ల మరమ్మతుల కారణంగా ఘట్‌కేసర్‌ 33/11కేవీ సబ్‌స్టేషన్‌ శివారెడ్డిగూడ 11కేవీ ఫీడర్‌ పరిధిలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మారుతీనగర్‌, శివారెడ్డిగూడ, మైసమ్మగుట్ట, ఘనాపూర్‌, యాదాద్రి, బండారి అపార్ట్‌మెంట్స్‌, తహసీల్దార్‌ కార్యాలయంలో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఘట్‌కేసర్‌ ఏఈ సతీశ్‌కుమార్‌ తెలిపారు. విద్యుత్‌ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పోచారం: సింగపూర్‌ టౌన్‌షిప్‌లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగిస్తున్న కారణంగా బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్‌ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌ కుమార్‌ ప్రకటించారు. దీంతో టౌన్‌షిప్‌లోని ఏ1 నుంచి ఏ23, ఏ36 నుంచి ఏ50, సీ–4 నుంచి సీ–10 బ్లాకులు, పల్లవి మోడల్‌ స్కూల్‌, డీ–1 ఫేస్‌–2 ప్రాంతాలకు విద్యుత్‌ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

15న ఆర్జీకేలో మున్సిపల్‌ షాపుల వేలం

స్థానికులకు కేటాయించాలని బీజేపీ డిమాండ్‌

పోచారం: అన్నోజిగూడలోని రాజీవ్‌ గృహ కల్ప కాలనీలో నిర్మించిన షాపులను అద్దెకు ఇచ్చేందుకు ఈనెల 15న వేలం పాట నిర్వహించనున్నారు. కాగా ఈ షాపులు కాలనీవాసులకే కేటాయించాలని బీజేపీ నేతలు డిమాండ్‌ చేస్తున్నారు. అందుబాటులో ఉన్న 10 షాపుల్లో 9 ఓపెన్‌ కేటగిరీ, 1 షాపు ఎస్సీకి రిజర్వ్‌ చేశారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఈనెల 13న సాయంత్రం 5 గంటల లోపు పోచారం మున్సిపల్‌ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని ప్రకటించారు.

మహిళ అదృశ్యం



ప్రియాంక (ఫైల్‌)

ఘట్‌కేసర్‌: భర్తతో గొడవపడి ఓ మహిళ అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన బొజ్జ సాయికుమార్‌, కలసాని ప్రియాంక (26) ఇరువురు ప్రేమ వివాహం చేసుకుని గత జనవరి నుంచి ఘట్‌కేసర్‌లో నివాసం ఉంటున్నారు. ప్రియాంక ఎస్‌ఏపీ కోర్సుకు సన్నద్ధమవుతుంది. సోమవారం రాత్రి భార్యభర్తలు గొడవ పడగా.. మనస్తాపానికి గురైన భార్య భర్తకు చెప్పకుండా ఫోన్‌ ఇంట్లో పెట్టి వెళ్లి పోయింది. దీంతో భర్త బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా భార్య ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్‌ కమిషనర్‌ రాజేంద్రకుమార్‌

మేడ్చల్‌రూరల్‌: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని గుండ్లపోచంపల్లి మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 'ఇంటిగ్రేటెడ్‌ వెజ్‌ అండ్‌ నాన్‌వెజ్‌ మార్కెట్‌' ఆవరణలో మున్సిపల్‌ పాలకవర్గం, నాయకులతో కలిసి మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాలు సమృద్ధిగా కురవాలన్నా.. చెట్టు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. వనమహోత్సవంలో భాగంగా 1000 మొక్కలు నాటామని తెలిపారు. మున్సిపల్‌ కమిషనర్‌ శ్రీహరి, వైస్‌ చైర్మన్‌ ప్రభాకర్‌, కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, పెంటయ్య, సాయిపేట శ్రీనివాస్‌, హేమంత్‌రెడ్డి, కో– ఆప్షన్‌ సభ్యులు, అధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

నేడు నాగారంలో వన మహోత్సవం

కీసర: నాగారం మున్సిపాలిటీలో నేడు వనమహోత్సవంలో భాగంగా తారక ఎన్‌క్లేవ్‌లోని పార్కులో మున్సిపల్‌ పాలకవర్గం సభ్యులు, కాలనీవాసులందరితో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా మంగళవారం తారక ఎన్‌క్లేవ్‌లో మొక్కలు నాటేందుకు చేపట్టిన గుంతలు తీసే పనులను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ రాంరెడ్డి, మున్సిపల్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ నుంచి బీజేపీలో చేరిక

కాప్రా: తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కాలం నుంచి గులాబీ పార్టీ వెన్నంటే ఉన్న కాప్రా డివిజన్‌ సీనియర్‌ నాయకుడు సూడుగు మహేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు గుడ్‌ బై చెప్పారు. మాజీ ఎమ్మెల్యేలు భేతి సుభాష్‌రెడ్డి, ఎన్‌వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌ పిలుపు మేరకు ఎంపీ ఈటల రాజేందర్‌ సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. బీఆర్‌ఎస్‌ కాప్రా డివిజన్‌ అధ్యక్షుడిగా పని చేశాడు. ఆయనతో పాటు మహిళా విభాగం అధ్యక్షురాలిగా పని చేసిన సురేఖ కూడా బీజేపీలో చేరారు.

కల్యాణోత్సవంలో కార్పొరేటర్‌

కుషాయిగూడ: బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం జరిగిన అమ్మవారి కల్యాణ మహోత్సవంలో చర్లపల్లి కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి పాల్గొన్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



గోడను కుదించి రోడ్డును విస్తరించాలి



చిలుకానగర్‌లో పర్యటిస్తున్న జోనల్‌ కమిషనర్‌ తదితరులు

ఉప్పల్‌: పిస్తా హౌస్‌ చౌరస్తాలో నిరుపయోగంగా ఉన్న పార్కు గోడను కుదించి రోడ్డును విస్తరించాలని జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ కేశవ్‌ పాటిల్‌ అధికారులకు ఆదేశించారు. చిలుకానగర్‌ డివిజన్‌లో కార్పొరేటర్‌ బన్నాల గీతా ప్రవీణ్‌తో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిలుకానగర్‌ బొడ్రాయి ప్రాంతంలో ఉన్న పురాతనమైన బావిలో చెత్తను తొలగించి ప్రహరీని ఏర్పాటు చేయాలన్నారు. బోడుప్పల్‌ నుంచి వచ్చే సివరేజ్‌ పైప్‌లైన్‌ను కావేరి కల్వర్టు వరకు వేయాల్సిందిగా ప్రతిపాదించారు. ఆదర్శనగర్‌ హిందూ శ్మశాన వాటికలో పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీ అంజనేయులు, ఈఈ నాగేందర్‌, డీఈ చందన పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో..

మల్కాజిగిరి: భార్య ప్రవర్తనపై అనుమానంతో భర్త దాడి చేయడంతో ఆమె మృతి చెందింది. ఈ ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్‌ సత్యనారాయణ వివరాల ప్రకారం.. పీవీఎన్‌ కాలనీకి చెందిన ఆకుల రాజేందర్‌, కృష్ణకుమారి భార్యాభర్తలు. రాజేందర్‌ కారు డ్రైవర్‌గా, కృష్ణకుమారి(38) కాచిగూడలోని ప్రైవేట్‌ ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తున్నది. కొంత కాలంగా భార్య ప్రవర్తనపై అనుమానాలు పెంచుకున్న రాజేందర్‌ తరచూ గొడవపడేవాడు. ఈ నెల 8వ తేదీన వారిద్దరికీ సర్దిచెప్పేందుకు అదే ప్రాంతంలో ఉన్న ఆమె అక్క జ్యోత్స్న, ఆమె భర్త వచ్చారు. ఆ సమయంలో కూడా కృష్ణకుమారిని రాజేందర్‌ కొట్టాడు. హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న కూతురిని మరుసటి రోజు ఉదయం రాజేందర్‌ తీసుకొచ్చాడు. తల్లిని నిద్ర లేపడానికి కూతురు ప్రయత్నించినా లేవలేదు. వెంటనే ఆమె పెద్దమ్మకు సమాచారం ఇచ్చింది. ఆమె వచ్చి చూసే సరికి కృష్ణకుమారి మృతి చెంది ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్‌ తెలిపారు.


మూసీ పరివాహక ప్రాంతాల అభివృద్ధికి కృషి



పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎండీ గౌతమి

ఘట్‌కేసర్‌: మూసీ పరివాహక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు 'మూసీ రివర్‌ ఫ్రంట్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌' జాయింట్‌ ఎండీ గౌతమి అన్నారు. మంగళవారం ప్రతాపసింగారం, కాచవానిసింగారంలో ఆమె పర్యటించి మూసీ ప్రాంతాల రైతులతో మాట్లాడారు. ల్యాండ్‌ పూలింగ్‌ ద్వారా హెచ్‌ఎండీఏ చేపడుతున్న వెంచర్‌లో పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూసీని ప్రక్షాళన చేసి కాలుష్యం నుంచి విముక్తి కల్పిస్తామన్నారు. స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ రామచంద్రప్ప, రైతులు సుభాష్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ధర్మారెడ్డి, అంజయ్యయాదవ్‌ పాల్గొన్నారు.

వెంకటేశ్వర్‌రావుకు డాక్టరేట్‌



మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్‌ కళాశాల ఐటీ బ్రాంచ్‌ హెచ్‌ఓడీగా పనిచేస్తున్న అధ్యాపకుడు వెంకటేశ్వర్‌రావుకు అనంతపురం జేఎన్‌టీయూ డాక్టరేట్‌ ప్రదానం చేసింది. 'స్టాక్‌ మార్కెట్‌ ప్రైస్‌ ప్రిడిక్షన్‌ యూజింగ్‌ ఫీచర్‌ ఆప్టిమైజేషన్‌ అండ్‌ హైబ్రీడ్‌ మెషిన్‌ లెర్నింగ్‌ టెక్నిక్స్‌' అనే అంశంపై పరిశోధనకు గాను ఆయనకు డాక్టరేట్‌ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎంఆర్‌ గ్రూప్స్‌ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి, సీఎంఆర్‌సెట్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ నారాయణ, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.